క్లుప్తంగా

దేవరపల్లి తహసీల్దార్‌గా రాజ్యలక్ష్మి



దేవరపల్లి: స్థానిక తహసీల్దార్‌గా కె.రాజ్యలక్ష్మి నియమితులయ్యారు. ఆదివారం ఆమె ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. కొయ్యలగూడెం తహసీల్దార్‌గా పని చేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. సార్వత్రిక ఎన్నికల ముందు చాగల్లు తహసీల్దార్‌గా పనిచేస్తూ ఎన్నికల బదిలీల్లో భాగంగా కొయ్యలగూడెం బదిలీ అయ్యారు. అక్కడ నుంచి దేవరపల్లికి బదిలీ అయ్యారు. బాధ్యతలు స్వీకరించిన రాజ్యలక్ష్మిని కార్యాలయ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు.

కోటసత్తెమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తులు

నిడదవోలు రూరల్: శ్రావణమాసాన్ని పురస్కరించుకుని తిమ్మరాజుపాలెం గ్రామంలో ఉన్న కోటసత్తెమ్మ అమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు అప్పారావు శర్మ పర్యవేక్షణలో కోటసత్తెమ్మ అమ్మవారికి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. అమ్మవారి దర్శనాలు, ప్రసాదం, పూజా టిక్కెట్లు, ఫొటోలు అమ్మకంతో రూ.1,25,211 ఆదాయం వచ్చినట్టు ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ వి.హరి సూర్యప్రకాష్ తెలిపారు.

లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా ఉద్యమించాలి

దేవరపల్లి: కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా కార్మికులంతా ఉద్యమించాలని పౌరహక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నంబూరి శ్రీమన్నారాయణ పిలుపునిచ్చారు. గౌరీపట్నంలో భారత కార్మిక సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో ఆదివారం ఐఎఫ్‌టీయూ రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకుడు పి.నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో శ్రీమన్నారాయణ పాల్గొని మాట్లాడారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత యాజమానులు, కార్పొరేట్ల హక్కులు పెరిగి కార్మికవర్గం హక్కులు కోల్పోయిందన్నారు. కార్మికవర్గం తమ హక్కుల పరిరక్షణకు ఐక్యంగా ఉద్యమించాలని ఆయన కోరారు.

పేకాడుతున్న ఐదుగురి అరెస్టు

కొవ్వూరు: పట్టణ క్రిస్టియన్‌పేటలో ఆదివారం పేకాడుతున్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్టు పట్టణ ఎస్సై కె.జగన్‌మోహన్‌రావు తెలిపారు. వీరి నుంచి రూ.2,700 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

ప్రిజన్ కేఫ్ నేడు ప్రారంభం

కంబాలచెరువు: జైళ్ల శాఖ సౌజన్యంతో రాజమండ్రి సెంట్రల్ జైలుకు ఎదురుగా నిర్మించిన ప్రిజన్ కేఫ్, బాక్స్ క్రికెట్, పెట్రోల్ బంకును రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత సోమవారం ప్రారంభించనున్నారు. ఈ వివరాలను జైలు సూపరింటెండెంట్ ఎస్.రాహుల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో భాగంగా కేంద్ర కారాగారంలోని దివ్యాంగులకు కృత్రిమ అవయవాలను మంత్రి అందజేయనున్నారు. పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొంటారు.

కౌలు.. కుదేలు

- కౌలు రైతులపై ఏదీ కనికరం?
- రుణాల పంపిణీలో వెనకంజ
- డివిజన్‌లో 180.44 కోట్ల లక్ష్యం కాగా కేవలం రూ.5.67 కోట్ల రుణాలు అందజేత
- అందరికీ అందని పంట సాగు హక్కు పత్రాలు
- పంట నష్ట పరిహారం అందించడంలో అన్యాయం



రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన సీసీఎల్‌సీ కార్డు

కొవ్వూరు: కౌలురైతుల కష్టాలపై సర్కారు కనికరం చూపడంలేదు. వారి అవసరాలపై దృష్టి సారించడం లేదు. దీంతో వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బ్యాంకుల నుంచి ఆశించిన స్థాయిలో రుణాలు ఇవ్వకపోవడంతో పెట్టుబడులకు ఇబ్బంది పడుతున్నారు. ప్రకృతి విపత్తుల కారణంగా దెబ్బతిన్న పంటలకు పరిహారం అందక నష్టపోతున్నారు. కౌలుకి భూమి సాగు హక్కు పత్రాలు (సీసీఆర్‌సీ) పొందలేక భూములు సాగు చేయలేని పరిస్థితుల్లో కౌలుదారులు కాలం వెళ్లదీస్తున్నారు. దీనికి తోడు డివిజన్‌లో అనేక మండలాల్లో కౌలుదారుడు గత ఏడాది సాగు చేసిన భూమికి అధికారులు సీసీఆర్‌సీ కార్డులు జారీ చేశారు. వాస్తవానికి ఆ కౌలుదారుడు ఈ ఏడాది మరోక భూమిని సాగు చేస్తున్నారు. దీంతో ప్రభుత్వపరంగా అందే రాయితీలు సైతం కౌలురైతు కోల్పోతున్నారు.

డివిజన్‌లో ఈ ఏడాది 56,480 మందికి సీసీఆర్‌సీ కార్డులు అందాలని లక్ష్యంగా నిర్దేశించారు. ఇప్పటి వరకు 52,949 మందికి అందజేసినట్లు అధికారులు చెబుతున్నారు. పంట సాగు హక్కు పత్రం కలిగిన కౌలు రైతులకు ఏపీ పంట సాగు హక్కు చట్టం-2019ని సెక్షన్ 3(2), 8(ఏ) ప్రకారం 11 నెలల కాల పరి మితికి రెండు పంట సీజన్‌లకు సరిపడేటట్లు ఈ కార్డు అందజేస్తున్నారు. దీన్నే క్రాప్ కల్టివేషన్ రైట్ సర్టిఫికెట్ (సీసీ ఆర్‌సీ)కార్డులు అని అంటారు.

డివిజన్‌లో కౌలు హక్కు పత్రాలు జారీ, రుణాల పంపిణీ, లక్ష్యం వివరాలు ఇలా..

మండలం పేరు	లక్ష్యం కౌలుదారులు	కార్డులు పొందిన కౌలు రైతులు	రుణలక్ష్యం (రూ.కోట్లలో)	తీసుకున్న వారి సంఖ్య (రూ.లక్షల్లో)
కొవ్వూరు	6,650	6,294	21.26	12
నల్లజర్ల	7,750	7,093	24.76	52
నిడదవోలు	6,610	6,060	21.14	45
పెరవలి	6,540	6,096	20.91	35
చాగల్లు	5,920	5,580	18.93	685
దేవరపల్లి	5,190	5,043	16.60	12
తాళ్లపూడి	5,340	4,997	17.07	89
ఉండ్రాజవరం	6,320	5,897	20.21	60
గోపాలపురం	6,120	5,889	19.56	13
మొత్తం	56,480	52,949	180.44	1,003

పంట రుణాలు నామమాత్రమే..

డివిజన్ పరిధిలో ఉన్న తొమ్మిది మండలాల కౌలు రైతులకు ఈ ఏడాది రూ.180.44 కోట్లు రుణాలు అందించాలని లక్ష్యంగా ఉండగా 52,949 మందికి సీసీఆర్‌సీ కార్డులు అందిస్తే వీరిలో ఇప్పటి వరకు కేవలం 1,003 మంది కౌలు రైతులకు రూ.5,67,20,000 మాత్రమే రుణాలు అందించారు. దీనిలో కుడా రైతుల చేతికి అందిన సొమ్ము తక్కువే అని చెప్పవచ్చు. ఎందుకంటే గత ఏడాది బ్యాంకులకు చెల్లించాల్సిన రుణాలను కొందరు రైతులు వడ్డీ మాత్రమే చెల్లించి రుణాలను రెన్యూవల్ చేయించుకోవడంతో కాగితాల్లోనే రుణాలు పొందినట్లు ఉంటుంది. మొత్తం రుణాలు పొందిన రైతుల్లో చాగల్లు మండలంలో 685 మందికి రైతులకు రూ.4.25 కోట్లు రుణాలు అందించినట్టు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. అంటే మిగిలిన ఎనిమిది మండలాల్లో కేవలం రూ.1,42,20,000 రుణాలు మాత్రమే అందించారు. అంటే మొత్తం నిర్దేశించిన లక్ష్యంలో కేవలం మూడు శాతం మంది కౌలు రైతులకు మాత్రమే రుణాలు అందించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు డివిజన్‌లో 2,423 మంది రైతులకు చెందిన పంట లు ముంపుబారిన పడినట్లు అధికారులు నిర్ధారించారు. కౌలు వ్యవసాయం చేసే కొందరు రైతులు సీసీఆర్ కార్డులు లేకపోవడంతో పూర్తి స్థాయిలో నష్టపోయిన రైతులు పరిహారం పొందలేని పరిస్థితి ఏర్పడింది.

సాయం ఎప్పుడు అందుతుందో..

పంట రుణాలు, బీమా, విత్తనాలు, వ్యవసాయ పనిముట్ల పంపిణీలో సబ్సిడీ, పంటనష్ట పరిహారం వంటివి కౌలుదారుడికి సక్రమంగా అందడంలేదు. వివిధ కారణాలతో వాటికి దూరమవుతున్నారు. ప్రధానంగా గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందించే రైతు భరోసా పథకాన్ని టీడీపీ ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పేరుగా మార్చింది. ఈ పథకం విధి విధానాలు, మార్గదర్శకాలు ఖరారు చేయలేదు. ఇంకా పథకం అమలు చేయలేదు. దీంతో కౌలు రైతులు ఆందోళన చెందుతున్నారు. గతంలో రూ.లక్ష లోపు తీసుకున్న పంట రుణాలకు సున్నా వడ్డీకే రుణం గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందించేది. తీసుకున్న రుణం ఏడాది లోపు తిరిగి చెల్లించిన రైతులకు సున్నా వడ్డీ వర్తింపజేసే వారు. పంట రుణాలకు రైతు చెల్లించాల్సిన మూడు శాతం వడ్డీ భారాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరించి రైతులకు సున్నా వడ్డీ అందించేంది. దీనిపై టీడీపీ ప్రభుత్వం ఏవిధమైన నిర్ణయం వెల్లడించలేదు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కౌలు రైతులకు వైఎస్సార్ రైతు భరోసా పథకం కూడా అందించేవారు. ఇప్పుడు అన్నదాత సుఖీభవ పథకం ఈ రైతులకు అందిస్తారా, లేదా అన్నదీ వేచి చూడాల్సిందే. అంతేకాక వైఎస్సార్ యంత్రసేవ పథకం ద్వారా అందించే వ్యవసాయ పనిముట్లు పొందడానికి ఈ కార్డు ఉపకరించే పరిస్థితి ఉండేది. ఇప్పుడు ఏం చేస్తారో అన్నదీ వేచి చూడాల్సిందే. ప్రకృతి విపత్తుల కారణంగా పంట నష్టపోయిన పరిహారం ఇన్‌పుట్ సబ్సిడీ పొందే అవకాశం ఉంది. వాతావరణ ఆధారిత, దిగుబడి ఆధారంగా లెక్కించే వైఎస్సార్ ఉచిత పంట బీమా పథకం ద్వారా పంట నష్టపోయిన సందర్భంలో బీమా సాయం పొందే అవకాశం ఉంది. ఉచిత పంట బీమా పథకంపై టీడీపీ ప్రభుత్వ మార్గదర్శకాలు విడుదల చేయాల్సి ఉంది.



ఆరికిరేవుల సమీప పొలంలో మొవ్వపోటు తెగులు నివారణకు మందు పిచికారీ చేస్తున్న రైతు

ప్రభుత్వం ఆదుకోవాలి



మూడెకరాల్లో కౌలుకు చేస్తున్నా. ఒక్కో ఎకరానికి రూ.22 వేలు పెట్టుబడి పెట్టా. ఇటీవల వచ్చిన భారీ వర్షాలకు పంట పూర్తి దెబ్బతింది. రూ.66 వేలు నష్టం వచ్చింది. మళ్లీ వరి నాట్లు వేసేందుకు సిద్ధమవుతున్నా. పెట్టుబడి నిమిత్తం రూ.30 వేల వరకు ఖర్చువుతుంది. కౌలు రైతుల్ని ప్రభుత్వం ఆదుకోవాలి. అన్ని రకాల రాయితీలు కౌలు రైతులకు అందించాలి.

– బొడిగిన ధర్మరాజు, కౌలు రైతు, జగన్నాథపురం, నల్లజర్ల మండలం

సీసీఆర్‌సీ తప్పనిసరి



ప్రతి కౌలు రైతు సీసీఆర్‌సీ కార్డులు తప్పనిసరిగా తీసుకోవాలి. ఈ కార్డులు ఉంటేనే కౌలు రైతుకి బ్యాంకుల నుంచి రుణాలు ఇప్పించేందుకు నిరంతరం బ్యాంకర్లతో మాట్లాడుతున్నాం. కార్డుల ద్వారా రైతుకి రాయితీలు అందుతాయి. ఈ–క్రాప్‌లో పంట నమోదు చేయించుకోవాలి. ఇంకా కార్డు పొందని రైతులు వీఆర్వోలను సంప్రదించండి.

– పి.చంద్రశేఖర్, సహాయ వ్యవసాయ సంచాలకులు, కొవ్వూరు

బిల్లు పుస్తకాల్లేక నిలిచిన ఇసుక రవాణా



కుమారదేవం ఇసుక స్టాకు పాయింట్ వద్ద అధికారులపై మండిపడుతున్న లారీ డ్రైవర్లు

- కుమారదేవం ర్యాంపు వద్ద పడిగాపులు పడుతున్న లారీ డ్రైవర్లు
- లోడింగ్ కోసం రోజుల తరబడి నిరీక్షణ

కొవ్వూరు: కుమారదేవం ఇసుక ర్యాంపు వద్ద ఉన్న స్టాకు పాయింట్ వద్ద బిల్లు పుస్తకాల్లేకపోవడం ఆదివారం మధ్యాహ్నం నుంచి ఇసుక రవాణాకు ఆటంకం ఏర్పడింది. మూడు రోజుల నుంచి ఇక్కడే పడిగాపులు పడుతున్నామని లారీ డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం కావడం వల్ల అధికారులు అందుబాటులో లేకపోవడంతో బిల్లు పుస్తకాలు కొరత ఏర్పడిందని సిబ్బంది చెబుతున్నారు. సీరియల్ పాటించడం లేదని, కొందరు స్థానికులు అడ్డదారిలో లైన్‌లోకి రావడంతో పలువురు లారీలు, ట్రాక్టర్లు అడ్డుగా పెట్టడంతో వివాదస్పదమైంది. ఈ వివాదం ఒక లారీ అద్దాలు పగలుకొట్టిడం డ్రైవర్ మధ్య గోడవ చోటు చేసుకుంది. సాయంత్రం వరకూ నిరీక్షించినా ఫలితం లేకపోవడంతో కొందరు లారీ డ్రైవర్లు, యాజమానులు వెనుక తిరిగి వెళ్లిపోయారు. అధిక సంఖ్య లారీలు రావడంతో సుమారు కిలో మీటరు దూరం వరకూ నిలిచిపోయాయి.



కొవ్వూరు మండలం కుమారదేవం ఇసుక స్టాకు పాయింట్ వద్ద బారులు తీరిన లారీలు

హర్ ఘర్ తిరంగా అవగాహన ర్యాలీ



పాల్‌చౌక్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, ప్రముఖులు

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా స్థానిక ఇన్నీసుపేట శాఖ గ్రంథాలయం, రాజమహేంద్రి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం హర్ ఘర్ తిరంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇన్నీసుపేట శాఖా గ్రంథాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ, శ్యామలా సెంటర్ మీదుగా స్వాతంత్ర్య సమరయోధుల పార్కు(పాల్‌చౌక్)కు చేరుకుంది. ఈ సందర్భంగా ట్రస్టు బోర్డు మెంబర్ మతల రమేష్ మాట్లాడుతూ నాటి స్వాతంత్ర్య సమరయోధులను స్మరిస్తూ ఉత్సవంగా జరపడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం పార్కులో సామాజిక కార్యకర్త దేశిరెడ్డి బలరాంనాయుడు, రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి పసల శివకుమార్, రిటైర్డ్ వాయుసేన ఉద్యోగి ఆర్‌ఎస్‌బీ రవి (కార్గిల్ పోరాట యోధుడు), ట్రస్ట్ సభ్యులు శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఇన్నీసుపేట కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ కోళ్ల అచ్యుత రామారావు(బాబు), రెడ్డి బాబు, చలుమూరి సత్యనారాయణ, గ్రేడ్–3 లైబ్రేరియన్ పి.శ్రీదేవి తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో కల్వర్టులు



మల్లవరం వద్ద రహదారిలో ప్రమాదభరితంగా ఉన్న కల్వర్టు



బీటలు వారిన కల్వర్టు

- తరచూ ప్రమాదాలు
- పట్టించుకోని అధికారులు

చాగల్లు: ఆర్‌అండ్‌బీ రహదారుల్లో కల్వర్టులు శిథిలావస్థలో ఉన్నాయి. ఎప్పుడో నిర్మించిన కల్వర్టు కావడంతో పాడై కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. కల్వర్టులు ఇరుకుగా ఉండడ, ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో వేగంగా వచ్చే వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. రాత్రివేళల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. చాగల్లు మండలంలో ప్రధానంగా దారవరం– కొవ్వూరు రహదారిలో మల్లవరం వద్ద ఉన్న కల్వర్టు శిథిలమై ప్రమాదభరితంగా ఉంది. ఈ కల్వర్టు బీటలు వారి కూలిపోయే స్థితిలో ఉన్నా ఆర్‌అండ్‌బీ అధికారులు చర్యలు తీసుకోవడంలేదు. ఈ కల్వర్టు కూలిపోతే మార్కొండపాడు, చంద్రవరం, దారవరం, మల్లవరం, గౌరిపల్లి, పశివేదల తదితర గ్రామాలకు రాకపోకలు అంతరాయం ఏర్పడుతుంది. నిత్యం అనేక వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే ఈ రహదారిలో కల్వర్టుకు రైలింగ్ కూడా లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. గతంలో ఆటో ఈ కల్వర్టు వద్ద ప్రమాదానికి గురై బోల్తా పడడంతో అందులో ప్రయాణిస్తున్న పలువురు ప్రమాదానికి గురయ్యారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

బడుగు వర్గాల ఆశాజ్యోతి వంగవీటి

- సీతంపేటలో వంగవీటి మోహన్‌రంగా విగ్రహావిష్కరణ



సీతంపేటలో వంగవీటి విగ్రహావిష్కరణలో పాల్గొన్న వంగవీటి రాధాకృష్ణ, ఎమ్మెల్యేలు తదితరులు

కొవ్వూరు: స్వర్గీయ వంగవీటి మోహన్‌రంగా ఒక కులానికే నాయుకుడు కాదని, బడుగు, బలహీన వర్గాలకు ఆశాజ్యోతి అని పలువురు వక్తలు కొనియాడారు. కొవ్వూరు మండలం సీతంపేట గ్రామంలో విజ్జేశ్వరం రోడ్డు జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన వంగవీటి మోహన్‌రంగా విగ్రహాన్ని ఆయన తనయుడు రాధాకృష్ణ ఆదివారం సాయంత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ వంగవీటి ప్రజల తరుపున నిలబడి పోరాటం సాగించారన్నారు. ఆయన పోరాట స్ఫూర్తిని మనమందరం కొనసాగిద్దామన్నారు. రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, డీసీసీబీ మాజీ అధ్యక్షుడు కరాటం రాంబాబు, ఎమ్మెల్యేలు ముప్పిడి వెంకటేశ్వ రరావు, ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు), బొలిశెట్టి శ్రీనివాస్, బండారు శ్రీనివాస్ రంగా గొప్పతనం గురించి వివరించారు. పేదలు, బడుగు, బలహీన వర్గాల కోసం నిరంతరం పని చేసి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన వ్యక్తి మోహన్‌రంగా అని పేర్కొన్నారు. విగ్రహానికి నేతలు పూల మాలలు వేసి నివాళి ఆర్పించారు. అభిమాన జనంతో సీతంపేట సెంటర్ జనసంద్రంగా మారింది. మాజీ ఎమ్మెల్యే టీవీ రామారావు, మద్దూరు, సీతంపేట సర్పంచులు ఉప్పులూరి ముని రాజేంద్ర ప్రసాద్(బాబ్జీ), జెట్టి బంగారయ్య, మారిశెట్టి వెంకటేశ్వరరావు, దేవన సత్యనారాయణ, శ్రీరంగం బుజ్జిబాబు, రంగా, రాధ మిత్ర మండలి సభ్యులు, అధిక సంఖ్యలో అభిమానులు పాల్గొన్నారు.

చిన్న పిల్లల వ్యాధులపై అవగాహన



వైద్య నిపుణులను సత్కరిస్తున్న సభ్యులు

రాజమహేంద్రవరం రూరల్: పీఎంపీలు చిన్న పిల్లల వ్యాధులను గుర్తించడంలో అవగాహన కలిగి ఉండాలని ప్రముఖ పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ కేవీడీ ప్రసాద్ అన్నారు. ఆదివారం కమ్యూనిటీ పారా మెడిక్స్–ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్(ది పీఎంపీ అసోసియేషన్) ఆధ్వర్యంలో హుకుంపేటలో వైద్య విజ్ఞాన అవగాహన సదస్సు నిర్వహించారు. సంఘ రాజమండ్రి శాఖ అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్‌ఖాన్ అధ్యక్షత వహించారు. డాక్టర్ కేవీడీ ప్రసాద్ మాట్లాడుతు చిన్న పిల్లల్లో వచ్చే క్యాన్సర్‌పై, సీజనల్ జ్వరాలకు ప్రాథమిక వైద్యంపై వివరించారు. మరో ముఖ్యఅతిథి డాక్టర్ సీహెచ్ శరత్‌చంద్ర పీఎంపీల సేవలను అభినందించారు. సంఘ రాష్ట్ర అధ్యక్షుడు తోరాటి ప్రభాకరరావు, ప్రధాన కార్యదర్శి వీబీటీ రాజు మాట్లాడుతూ ప్రభుత్వం ఆరోగ్య కార్యక్రమాలలో పీఎంపీలు పాల్గొని, ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు, ఈ సందర్భంగా వైద్య నిపుణులను సత్కరించారు. కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షుడు బళ్లా శ్రీనివాసరావు, ప్రతినిధులు పి.దేవానందం, పి.చిన్ని, మట్టా రమేష్, యు ప్రసాద్‌బాబు, ఏ సురేష్ బాబు, సుంకర శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వైఎంవీఏ ఆశయాలను కొనసాగించాలి



నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న శివరామ సుబ్రహ్మణ్యం తదితరులు

సీటీఆర్‌ఐ: యంగ్ మెన్స్ వైశ్యా అసోసియేషన్ ఆశయాలను నూతన కార్యవర్గం కొనసాగించాలని ఏపీఐఐసీ మాజీ చైర్మన్ శ్రీఘాకోళ్లపు శివరామ సుబ్రహ్మణ్యం అన్నారు. స్థానిక గోదావరి గట్టున ఉన్న వైఎంవీఏ హాలులో సంఘ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం ఆదివారం ఘనంగా జరిగింది. విశిష్ట అతిథిగా శివరామ సుబ్రహ్మణ్యం, ముఖ్య అతిథిగా ఏపీ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు కూసుమంచి సుబ్రహ్మణ్యం, గౌరవ అతిథిగా ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు కంచర్ల వెంకట్రావు పాల్గొన్నారు. శివరామ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఎందరో ప్రముఖులు సేవా కార్యక్రమాలతో వైఎంవీఏకు మంచి పేరు తెచ్చారని చెప్పారు. నూతన అధ్యక్షుడు మైలవరపు శ్యామలరావు, కార్యదర్శి కన్నెగొళ్ల రవికాంత్, కోశాధికారి కొత్త వెంకటకిషోర్‌ను సత్కరించారు. ఈ సందర్భంగా 60 మంది పేద వైశ్య విద్యార్థులకు స్కాలర్‌షిప్పులు అందజేశారు. కార్యక్రమంలో సంఘ ఉపాధ్యక్షుడు బొండాడ ప్రభాత్, అప్పన షణ్ముఖ్ రంగరాజు, తోట లక్ష్మీనారాయణ (కన్నా), సహాయ కార్యదర్సులు గొల్లపూడి నాగేంద్రకుమార్, బత్తుల సిద్ధార్థ, కారుమూరి చరణ్‌తేజ్ తదితరులు పాల్గొన్నారు.

నిషేధమా..! ఎక్కడా..?

వివిధ రంగాల్లో ప్రసిద్ధి చెందిన రాజమహేంద్రవరం నగరం అస్తవ్యస్థంగా తయారైంది. గోదావరి పరివాహక ప్రాంతం, చారిత్రక ప్రాధాన్యం కలిగిన ఈ నగరానికి నిత్యం దేశ, విదేశాల నుంచి పర్యాటకులు వస్తుంటారు. నగరపాలక సంస్థ పరిధిలో కనీస నిషేధాలు కూడా అమలు కాకపోవడంతో, దుర్గంధ పూరిత వాతావరణంతో వారంతా ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఈ నేపథ్యంలో చారిత్రక, సాంస్కృతిక, ఆధ్యాత్మిక రాజధాని ప్రతిష్ఠకు విఘాతం కలుగుతుందని సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది.

- నగరపాలక సంస్థ పరిధిలో అటకెక్కిన నిషేధాలు
- యథేచ్ఛగా పశువుల సంచారం
- ఇష్టారాజ్యంగా ప్లాస్టిక్ విక్రయాలు, వినియోగం
- నిత్యం 80 టన్నుల వ్యర్థాల ఉత్పత్తి



ఓ డ్రైన్ నుంచి బయటకు తీసిన ప్లాస్టిక్ వ్యర్థాలు



నగరంలో విచ్చలవిడిగా సంచరిస్తున్న పశువులు

రాజమహేంద్రవరం సిటీ: నగరపాలక సంస్థ పరిధిలో పశువుల సంచారం, 40 మైక్రాన్ల లోపు ప్లాస్టిక్ కవర్లు, గ్లాసుల వాడకాలను నిషేధిస్తున్నట్లు ప్రకటించి ఏళ్లు గడుస్తున్నా అవి ఏమాత్రం అమలు కావడం లేదు. నగరంలో పశువుల సంచారం యథేచ్ఛగా జరుగుతుండటంతో వాహన చోధకులు నిత్యం ప్రమాదాలకు గురవుతున్నారు. నగరంలో ఉదయం నుంచి రాత్రి వరకు వాహనాల రాకపోకల సమయంలో జరుగుతున్న పశువుల సంచారం ప్రమాదాలను తెచ్చిపెడుతోంది..గతంలో రోడ్లపై తిరుగుతున్న పశువులను తరలించేందుకు నగరపాలక సంస్థ ఓ ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసింది. నగరంలో పశువులను వదలి వేస్తున్న వాటి యజమానులపై కేసులు నమోదు చేస్తామంటూ హెచ్చరికలూ జారీ చేసింది. అవేమీ ఇప్పుడు ప్రయోజనం లేకుండా పోయాయి.

భూమి కేటాయింపు

ఉదయం, సాయంత్రం సమయంలో పశువుల యజమానులు పాలు తీశాక, పశువులను రోడ్లపైకి వదిలి వేస్తుండటంతో, తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. నగరంలో రోడ్లపై సంచరించే పశువులను ప్రత్యేక వాహనాల్లో తీసుకువెళ్లి, జిల్లాలోని సీతానగరం మండలం బొబ్బిలిలంక గ్రామంలో గోశాలకు తరలించి పోషించేందుకు అవసరమైన చర్యలు చేపట్టారు. దీనికోసం నగరపాలక సంస్థ 11 ఎకరాల భూమిని కేటాయించింది. ఈ చర్యలు తూతూమంత్రంగా మిగిలాయి. జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరంలో నిత్యం పశువులు విచ్చలవిడిగా తిరుగుతున్నప్పటికీ, నగరపాలక సంస్థ అధికారులు చోద్యం చూస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు చేపట్టి, వీధుల్లో తిరుగుతున్న పశువులపై చర్యలు చేపట్టాలని నగర ప్రజలు కోరుతున్నారు.

హెచ్చరికలు బేఖాతరు

నగరంలో సుమారు 30 ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులమ్మే షాపులున్నాయి అయితే 40 కన్నా తక్కువ మైక్రాన్లు ఉన్న ప్లాస్టిక్ వస్తువులను వాడితే చర్యలు తప్పవని హెచ్చరికలు జారీ చేసిన నగరపాలక సంస్థ.. ప్లాస్టిక్ నిషేధాన్ని అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తక్కువ మైక్రాన్లు కలిగిన ప్లాస్టిక్ కవర్లను హోటళ్లు, తోపుడు బండ్లు, ఇతర చిన్న వ్యాపారులు ఇష్టారాజ్యంగా వినియోగిస్తున్నారు. వీరిపై నగరపాలక సంస్థ పర్యవేక్షణ కొరవడింది. నగరంలో రోజుకు 80 టన్నులకు పైగా ప్లాస్టిక్ వ్యర్థాలను నగరపాలక సంస్థ పారిశుధ్య కార్మికులు సేకరిస్తున్నారు. స్వచ్ఛ రాజమహేంద్రవరం సాధించేందుకు ప్లాస్టిక్ నిషేధాన్ని కఠినంగా అమలు చేస్తామంటూ, వాటిని వాడే వ్యాపారులు, నగర పౌరుల పైనా చర్యలు తప్పవంటూ నగరపాలక సంస్థ జారీ చేసిన హెచ్చరికలు కొంతకాలమే పనిచేశాయి. నగరపాలక సంస్థ అధికారులు ఏమాత్రం చర్యలు చేపట్టకపోవడంతో ఇటీవల కాలంలో ప్లాస్టిక్ వినియోగం సర్వసాధారణంగా మారింది. ఇప్పటికైనా నగరపాలక సంస్థ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, ప్లాస్టిక్ వినియోగంపై కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది. ఈ విషయమై శానిటరీ సూపర్‌వైజర్ శ్రీనివాస్‌ను వివరణ కోరగా, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నగరంలో ఎప్పటికప్పుడు చర్యలు చేపడుతున్నామన్నారు.